# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వ్యవసాయ ఉత్పాదకత, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేలా పీఎం ధన్ ధాన్య కృషి యోజనకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నంద్యాల జిల్లాల్లో పర్యటించి హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేస్తారు.**
3. **ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించేందుకు కమిటీ వేయాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు.**
4. **సౌరశక్తి వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో జిల్లా ప్రజా పరిషత్ –జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్– ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ఖరారు చేసింది.**

==========================

వ్యవసాయ ఉత్పాదకత, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేలా పీఎం ధన్ ధాన్య కృషి యోజనకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మంత్రి వర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి 20 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు.

..వాయిస్.. 30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువ నుంచి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

--------------------------

అంతర్జాతీయస్థాయి అభివృద్ధి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన సీఐఐ సదస్సులో స్వర్ణాంధ్ర 2047 టాస్క్ ఫోర్సు నివేదికను ముఖ్యమంత్రి నిన్న ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మూడు ఆర్థిక కారిడార్లలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు అనుకూలంగా విధానాలు రూపొందించామని వివరిస్తూ,

వాయిస్.. 33.. సెకన్లు

---

తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ.రేవంత్ రెడ్డి నిన్న ఢిల్లీలో సమావేశమైయ్యారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానంపై ఆంధ్రప్రదేశ్ ఏక అంశ అజెండాను, తెలంగాణ 13 అంశాలను ప్రతిపాదించాయి. ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అజెండాలో చేర్చింది.

సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నీటి అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు. గోదావరి, కృష్ణా నదుల నీటి కేటాయింపులపై చర్చించామని మంత్రి తెలిపారు.

మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాత్రికేయులుతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలను గుర్తించడానికి, పరిష్కారానికి సీనియర్ అధికారులు, ఇంజినీర్లు, నిపుణులతో కమిటీని నియమించాలని నిర్ణయించామని పేర్కొంటూ...

వాయిస్ .. 23.. సెకన్లు

---

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమై రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక సాయం కింద ఆంధ్రప్రదేశ్‌కు 10 వేల కోట్ల రూపాయలు అదనంగా ఇవ్వాలని మంత్రి కోరారు. రాష్ట్రానికున్న రెవెన్యూ లోటు భర్తీ కోసం నిధులు ఇవ్వాలని, 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమరావతికి రెండోవిడత ఇచ్చే నిధులను గ్రాంట్ రూపంలో మంజూరు చేయాలని కోరారు.

---

క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ద్వారా ఆ వ్యాధిని నిర్మూలించవచ్చని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. రాష్ట్రంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' అమలు తీరుపై విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ని–క్షయ్ పోర్టల్‌లో గవర్నర్ తన పేరును నమోదు చేయించుకుని గుర్తింపు పత్రాన్ని తీసుకున్నారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంతోపాటు క్షయ నిర్మూలనకు అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం అని అధికారులకు సూచించారు.

---------------------------

సౌరశక్తి వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. సత్య సాయి జిల్లా హిందూపురంలో నిర్వహించిన 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన' పై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ పథకంలో మహిళల భాగస్వామ్యం కీలకమన్నారు. ఒక కోటి ఇళ్ల మీద రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..21 సెకను

---------------------------

తెలంగాణలో జిల్లా ప్రజా పరిషత్ –జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్– ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు.. 5 వేల 773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని తెలిపింది. 12 వేల 778 గ్రామ పంచాయతీలు, 1 లక్షా 12 వేల వార్డులు ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆయా స్థానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధ్యాన్యమిస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పెద్దపల్లిలో ఏర్పాటుచేసిన ఇందిరాశక్తి సంబరాల సభలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, సీతక్కలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, మహిళాభివృద్ధి ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇళ్ళ పట్టాలు, రేషన్ కార్డులు వంటివి మహిళల పేరు మీదే మంజూరు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే 9వేల కోట్ల రూపాయలను జమ చేశామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================